క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ

మఠంపల్లి : మండలంలోని భీమ్లాతండా, క్రిష్టా తండా, తదితర గ్రామ పంచాయతీల్లో గల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎంపీడీఓ ఎం.జానకిరాములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి పోలింగ్ కేంద్రాల్లో భోజన వసతి, తాగునీరు, విద్యుత్, మరుగు దొడ్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, కార్యదర్శులు, బీఎల్ఓలు తదితరులు ఉన్నారు.

కోర్టు భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కోదాడ : జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల నియమితులైన గోవర్ధన్‌రెడ్డిని, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామలశ్రీని శుక్రవారం కోదాడ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. కోదాడకు మంజూరైన నూతన కోర్టు భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు న్యాయమూర్తిని కోరారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని న్యాయమూర్తి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి చింతకుంట్ల రామిరెడ్డి, సరికొండ హనుమంత రాజు, వెంకటేశ్వరరావు, మంద వెంకటేశ్వర్లు, దొడ్డా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ అధ్యక్షుడు జెల్లి లక్ష్మీనర్సింహరావు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చలివేంద్రం, మజ్జిగ కేంద్రాన్ని ఆ క్లబ్ అధ్యక్షుడు జెల్లి లక్ష్మీనర్సింహరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాన్ని ప్రయాణికులు, బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ కార్యదర్శి అశోక్, కోశాధికారి తాళ్లూరి శ్రీనివాస్‌రావు, సభ్యులు గోపాలకృష్ణ, శ్రీనివాస్, మధు, రామ్మూర్తి, మహేష్, అశోక్, సత్యం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రచార సభ కరపత్రం ఆవిష్కరణ



మఠంపల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని శనివారం నిర్వహించబోయే కాంగ్రెస్ పార్టీ ప్రచార సభ కరపత్రాలను ఆ పార్టీ నాయకులు శుక్రవారం స్థానికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రచార సభలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, కర్నె రమణవెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కె.నరసయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శౌరీ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దైదా రాయలు, మహేష్‌గౌడ్, రత్నం, నాగేశ్వర రావు, జానీపాషా, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు, తదితరులు ఉన్నారు.

బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలని ప్రచారం



సిరిపురంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నడిగూడెం : ఈ నెల 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో నల్లగొండ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్ బండారు కవిత కోరారు. శుక్రవారం నడిగూడెం మండలంలోని సిరిపురంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సైదిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్‌కె.లతీఫ్, మండల ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, నాయకులు బాలక్రిష్ణ, రౌతు వర్మ, భిక్షంరెడ్డి, కేశగాని పాపయ్య, రాముడు, గోపిరెడ్డి, భిక్షపతి, నరేష్ పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

నేరేడుచర్ల : నల్లగొండ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం నేరేడుచర్ల మండలం దాసారం గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పార్తనబోయిన విజయ్‌కుమార్, విజయ్‌రెడ్డి, పవన్‌కుమార్, ప్రవీణ్, జగతయ్య, ఇందూజ, జగదీష్, మనోజ్ తదితరులు ఉన్నారు.

వరికొయ్యలు కాలిస్తే ముప్పే

- సారం కోల్పోతున్న భూములు
- దగ్ధమవుతున్న పండ్ల తోటలు, వ్యవసాయ మోటార్లు, హరితహారం చెట్లు
- పంట వ్యర్థాలకు నిప్పు పెట్టొద్దని అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



రామచంద్రాపురంలో ఇటీవల వరి కొయ్యలకు పెట్టిన మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



ఇటీవల కూచిపూడి, కాపుగల్లు గ్రామాల మధ్య దగ్ధమైన హరితహారం చెట్లు

కోదాడరూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో వ్యవసాయాన్ని సంప్రదాయ పద్ధతిలో సాగు చేస్తూ అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారు. మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నారు. పంట కాలం పూర్తయిన తర్వాత వరికొయ్యలకు, పంట వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. దీంతో భవిష్యత్ తరాలకు భూమిలో సారం లేకుండా పోతుంది. ప్రస్తుత యాసంగి సీజన్ ముగియడంతో హార్వెస్టింగ్ అనంతరం మిగిలిన గడ్డిని కొందరు మోపులు కట్టుకుంటుండగా మరికొందరు రైతులు పొలంలోనే కాల్చి వేస్తున్నారు. ఈ మంటలతో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మంటలు గాలివాటానికి కిలోమీటరు దూరం వరకు వ్యాపించి గ్రామాల మీదకు వెళ్తున్నాయి. దీంతో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా గ్రామాల్లో ఇప్పటికే వ్యవసాయ, పంచాయతీ రాజ్ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసిన ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

వాతావరణ కాలుష్యం సైతం..

వరి గడ్డికి, పత్తి, మొక్కజొన్న, మిర్చి కట్టెకు నిప్పు పెడుతుండడంతో అగ్ని ప్రమాదాలు జరిగి ప్రజలకు నష్టం వాటిల్లుతోంది. అంతేకాకుండా తీవ్రమైన వాతావరణ కాలుష్యం జరుగుతుంది. అయితే కొందరు రైతులు వ్యర్థాలకు నిప్పు పెట్టి ఇంటికి వెళ్తున్నారు. దీంతో ఆ మంటలతో పక్కనే ఉన్న పండ్ల తోటలు, గ్రామాల్లో గడ్డివాములు, హరితహారం మొక్కలు తగులబడి అగ్గిపాలు అవుతున్నాయి. ఇటీవల నడిగూడెం మండలం నారాయణపురం వ్యవసాయ భూముల్లో కొయ్యకాలకు నిప్పు పెట్టగా మంటలు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాగితరామచంద్రాపురం గ్రామం మీదకు వెళ్లాయి. దీంతో గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసముండే ప్రజలు బిక్కుబిక్కుమంటూ తమ సామగ్రిని బయటకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంటలు ఆర్పడానికి కోదాడతో పాటు కూసుమంచి నుంచి రెండు ఫైర్ ఇంజన్‌లు రావాల్సి వచ్చింది. అప్పటికే మంటల్లో దాదాపుగా 50 వ్యవసాయ మోటార్లు, బోర్లు అగ్నికి ఆహుతి అయ్యాయి.

భూమిలో తగ్గుతున్న కార్బన్ శాతం..

వరికొయ్యలకు, గడ్డికి నిప్పు పెట్టడంతో భూమిలో కార్బన్ శాతం తగ్గుతుంది. దీంతో మొక్కలకు అందాల్సిన పోషకాలు అందవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. భూమిలో 5 శాతం కార్బన్ ఉండాల్సి ఉండగా ప్రస్తుతం భూమిలో 0.5 శాతమే ఉందని భూ సార పరీక్షల్లో తేలిందని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. ఈ కార్బన్‌లోనే మొక్కకు కావాల్సిన దాదాపుగా అన్ని పోషకాలు ఉంటాయని, ప్రస్తుత పద్ధతులు ఇలాగే కొనసాగితే మరో 20 ఏళ్ల తర్వాత సాగు భూమిలో పంటలు తెగుళ్లను తట్టుకోలేవని అంటున్నారు. నేల పైభాగంలో ఉన్న పంటలకు మేలు చేసే సూక్ష్మక్రిములు, కీటకాలు కూడా చనిపోతాయని చెబుతున్నారు. కావున వరికొయ్యలకు, పంట వ్యర్థాలకు నిప్పు పెట్టొద్దని సూచిస్తున్నారు.

వరికొయ్యలు తగులబెట్టొద్దు



రైతులు కల్లాలు పూర్తయిన తర్వాత మిగిలిన వరిగడ్డి, వరి కొయ్యలను తగలబెట్టకూడదు. అలా చేస్తే భూమిపై ఉన్న మూలకాలన్నీ నిర్వీర్యం అవుతాయి. అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈవిషయంపై ఇప్పటికే గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నాటు పెట్టే సమయంలో గడ్డి మురగడానికి రోటోవేటర్‌తో దున్ని సూపర్ సాస్ఫేట్ చల్లితే లేదా డీకంపోజర్ వాడితే సరిపోతుంది. పంట వ్యర్థాలకు ఎవరైనా నిప్పు పెడితే చర్యలు తప్పవు.

– పాలెం రజిని, ఏఓ, కోదాడ

బీజేపీతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు



అభివాదం చేస్తున్న మంత్రి ఉత్తమ్, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి తదితరులు

- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెరువు : గత పదేళ్లుగా బీజేపీతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో నిర్వహించిన లోక్ సభ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ గత పదేళ్లుగా మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి, రామమందిరం, అక్షింతల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బొందపెట్టి బుద్ధి చెప్పారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగవుతుందని తెలిపారు. ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి ఐదు లక్షల మెజార్టీ రావడం ఖాయమని, అందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి జానారెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని, గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి చూసి ప్రజలు ఓటు వేయాలన్నారు. అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు, నిరుద్యోగులు, సామాన్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో వారు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సాముల శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కాకునూరి భాస్కర్‌రెడ్డి, కొట్టె సైదేశ్వరరావు, జెడ్పీటీసీ శాగంరెడ్డి పద్మ గోవిందరెడ్డి, రామచంద్రరావు, సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు, సీపీఐ నాయకులు సృజన, నారాయణరెడ్డి పాపిరెడ్డి, బద్రారెడ్డి, జయరాం నాయక్, సాధం గంగయ్య యాదవ్, వెంకటరెడ్డి, మోహన్‌రెడ్డి, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



చిలుకూరు : ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం మహాకూటమి ఆధ్వర్యంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో తిపిరిశెట్టి బసవయ్య, తిపిరిశెట్టి వెంకటరమణ, లక్ష్మీనారాయణ, పుష్ప, అంజమ్మ, చిట్టెమ్మ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీన జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జనపనేని జానకీకృష్ణారావు, మహాకూటమి అధ్యక్షుడు వేమూరి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సింగిల్‌విండో మాజీ చైర్మన్

నడిగూడెం : నడిగూడెం సింగిల్‌విండో మాజీ చైర్మన్ పుట్టా రమేష్ ఆయన వర్గీయులతో కలిసి శుక్రవారం కోదాడలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రమేష్ విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బృందావనపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డు గోవర్ధన్, సీనియర్ నాయకులు పుట్టా చంద్రయ్య, చిరంజీవి, చందర్‌రావు, చైతన్య, మాధవరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కంతమహేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



జలబిందెలతో ఆలయానికి వెళ్తున్న గౌడ కులస్తులు, మహిళలు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంతమహేశ్వరస్వామి– సురమాంబదేవి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం దేవాతమూర్తులకు అభిషేకం, జలబిందెలు, పంచామృత స్నానం, నైవేద్యం సమర్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో గౌడ కులస్తులు, జలబిందెలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం స్వామివారి కల్యాణం, ఆదివారం మోకు, ముస్తాదులతో పలు పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంపెట రవిగౌడ్, కులపెద్ద సంపెట రామయ్య, సంపెట ఉపేందర్, సంపెట సీతయ్య, వేముల వీరబాబు, ఎరగాని చందర్‌రావు, పంతంగి సత్యం, బండారు విజయ్, అనంతు సత్యం, గౌడ కులస్తులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయం



బీమా చెక్కు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

కోదాడరూరల్ : రైతుల సంక్షేమమే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ధ్యేయమని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోదాడ మండలంలోని తొగర్రాయికి చెందిన వట్టికూటి శ్రీను సంఘంలో రుణం తీసుకొని ఇఫ్కో సంస్థ నుంచి జనతా ఇన్సూరెన్స్ కలిగి ఉన్నాడు. కాగా, అతను తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందడంతో అతనికి జనతా ఇన్సూరెన్స్ రూ.లక్ష మంజూరయ్యాయి. ఆ చెక్కును శుక్రవారం మృతుని భార్య ఉపేంద్రకు అందజేసి మాట్లాడారు. రైతులు రుణాలు తీసుకునేటప్పుడు బీమా కూడా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్ ప్రభాకర్‌రావు, జాబిశెట్టి చంద్రమౌళి, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ రోడ్‌షోను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : నేరేడుచర్లలో శనివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించబోయే కాంగ్రెస్ రోడ్ షోను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి కోరారు. శుక్రవారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్లగొండ పార్లమెంటు అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించే ఈ రోడ్డు షోలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాల్గొననున్నారని తెలిపారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ పార్టీల కార్యకర్తలు భారీగా తరలిరావాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్మన్ అలక సరిత, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు, చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ మలిగిరెడ్డి రమణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు, కూటమి నాయకులు జ్యోతిబాబు, శ్రీనివాస్, నగేష్, రావుల సత్యం, చిలకరాజు శ్రీను, సైదానాయక్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఇండియా కూటమి గెలుపు దేశానికి అవసరం

కోదాడరూరల్ : పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుపు దేశానికి ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం కోదాడ మండలంలోని కూచిపూడి, అడ్లూరు, తొగర్రాయి గ్రామాల్లో నిర్వహించిన ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. రాష్ట్రంలో అమలు అవుతున్న ఆరు గ్యారంటీల గురించి అన్ని బూత్‌లలో నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన అవినీతి అక్రమాలతోనే సరిపోయిందని విమర్శించారు. దళితబంధు పేరుతో గుడిబండలో కోట్ల రూపాయాల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జెడ్పీటీసీ మండలపు కృష్ణకుమారి శేషు, ఇర్ల సీతారాంరెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు, సుందర్‌రావు, రామకృష్ణ, తిరపయ్య, లచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న చిలకరాజు శ్రీను

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐవైఎఫ్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నిరంతరం పోరాడినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సురేంద్రచారి, జయంత్, తరుణ్, వరుణ్, రాకేష్, ఖరీం, పుల్లయ్య, సైదాచారి, గోపి, సతీష్, శ్రీనివాసాచారి, లక్ష్మయ్య, రవి తదితరులు ఉన్నారు.

సపర్యలు చేసి.. ఆశ్రమానికి తరలించి



మతిస్థిమితం లేని వ్యక్తికి దుస్తులు అందిస్తున్న స్థానికులు, పోలీసులు

మునగాల : మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తికి స్థానికులు సపర్యలు చేసి అనాథాశ్రమానికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఈ ఘటన శుక్రవారం మునగాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మునగాలలో వీధుల వెంట తిరుగుతూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున అతని ఆరోగ్యరీత్యా భద్రత కల్పించేందుకు స్థానికులు సీహెచ్.ముత్తయ్య, వల్లోజు నాగరాజులు ఆ వ్యక్తిని చేరదీసి జుట్టు కత్తిరించి, స్నానం చేయించి కొత్త బట్టలు వేసి భోజనం పెట్టారు. అతడి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఆ వ్యక్తి భాష అర్థం కాలేదని వారు తెలిపారు. స్థానిక సీఐ డి.రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ఎన్.వెంకన్న ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రం శివారులో గల ఓ అనాథ వృద్ధాశ్రమంలో చేర్పించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి

మఠంపల్లి : గత పదేళ్లుగా కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం మండల పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో అనంతరం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించేందుకు సీపీఎం, సీపీఐ లౌకిక పార్టీల శక్తులన్నీ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, జాల తిరుపతయ్య, కె.వెంకటరెడ్డి, కంటు కోటయ్య, చల్లా లింగయ్య, పాడిశెట్టి రాము, చారి, హరి, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

అతుల్‌కుమార్ అంజన్ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు

నేరేడుచర్ల : అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్ మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట రైతు సంఘం మండల అధ్యక్షుడు కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకన్న, భిక్షం, రంజిత్‌రెడ్డి, రాంరెడ్డి ఉన్నారు.

నేడు జాన్‌పహాడ్‌లో కాంగ్రెస్ బహిరంగ సభ



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పాలకవీడు : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఏ.వి సుబ్బారావు తెలిపారు. శుక్రవారం ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్‌తో కలిసి సభా స్థలం, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సభకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, రాష్ట్ర నాయకులు హాజరవనున్నట్లు తెలిపారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాణావత్ సైదానాయక్, బెల్లంకొండ నరసింహారావు, నాగరాజు, వాజిద్, శ్రీకాంత్, హనుమంతు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌రెడ్డి

గరిడేపల్లి : ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలు పార్లమెంటు ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి కోరారు. శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని ఎమ్మెస్ భవనంలో దోసపాటి భిక్షం అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను పట్టించుకోని బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలను చిత్తుగా ఓడించేందుకు కమ్యూనిస్టులు కలిసి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు ఎస్‌కె యాకూబ్, యానాల సోమయ్య, అంబటి భిక్షం, మట్టయ్య, శ్రీనివాస్, మైబెల్లి, మీసాల మట్టయ్య, వెంకయ్య, పెంటయ్య, వీరస్వామి, వెంకటప్పయ్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్పించాలి



డ్రాయింగ్ మెటీరియల్ అందజేస్తున్న జేవీవీ నాయకులు

కోదాడ : శాస్త్రీయ విజ్ఞానం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని, వ్యక్తి, దేశ అభివృద్ధికి సైన్స్ మాత్రమే దోహదపడుతుందనే విషయాన్ని వారికి చెప్పాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ అంది సత్యం కోరారు. శుక్రవారం కోదాడలోని బాలుర పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు డ్రాయింగ్ మెటీరియల్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జి. రమేష్‌బాబు, శ్రీరాం ఆంజనేయులు, ఎస్‌కె. జాఫర్, డీఎస్.స్వామి, కలకొండ సైదులు, బడుగుల సైదులు, రామనర్సయ్య, ఆనంద్, జాన్‌బీ, మధుసూదన్ రెడ్డి, ఏలూరి శేషు, బ్రహ్మం పాల్గొన్నారు.

వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వాలీబాల్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ క్రీడా వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఎంపీడీఓ మామిడి జానకిరాములు ఎంపీఓ ఆంజనేయులతో కలిసి ప్రారంభించారు. కాగా, మొదటిరోజు 50 మంది విద్యార్థులు క్రీడా శిబిరంలో పాల్గొన్నట్లు పీఈటీ, నియోజకవర్గ పాఠశాలల క్రీడల కార్యదర్శి మన్నెం సీతారామిరెడ్డి తెలిపారు. చౌటపల్లికి చెందిన జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారుడు బేత వీరారెడ్డి తనతండ్రి నర్సిరెడ్డి జ్ఞాపకార్థం 3 వాలీబాల్స్ అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామక్రిష్ణ, పీఈటీలు బాలరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వీరస్వామి, ఉపేందర్‌రెడ్డి, సతీష్, ముక్కంటి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులు



మోతెలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగురాలు

నడిగూడెం : పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు రామాపురం, రత్నవరం, చాకిరాల, సిరిపురం గ్రామాల్లో శుక్రవారం హోం ఓటింగ్ నిర్వహించినట్లు తహసీల్దార్ హేమామాలిని తెలిపారు. 85 సంవత్సరాలు పైబడిన తొమ్మిది మంది వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో మరో తొమ్మిది మందికి శనివారం హోం ఓటింగ్ నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఏజెంట్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోతెలో దివ్యాంగురాలు..

మోతె : మండల కేంద్రానికి చెందిన దివ్యాంగురాలు పల్లెల వనిత శుక్రవారం తన ఇంటి వద్దనే పార్లమెంటు ఎన్నికల ఓటు హక్కును బ్యాలెట్ బాక్స్‌లో వేసినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. వయోవృద్ధులు, వికలాంగులు తమ ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకునే విధంగా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరెడ్డి, ఆర్ఐ మన్సూర్, బీఎల్ఓ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరువు మట్టి తరలింపు



చెరువు మట్టిని ట్రాక్టర్లలో నింపుతున్న ఉపాధి హామీ కూలీలు

మునగాల : మండల కేంద్రంలోని ఊరచెరువులో మట్టిని సన్న, చిన్నకారు రైతులు ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట పొలాలకు ముమ్మరంగా తరలిస్తున్నారు. సుమారు 20 ట్రాక్టర్లతో సారవంతమైన మట్టిని వ్యవసాయ పొలాలకు రైతన్నలు తోలుకుంటున్నారు. గత మూడు రోజులుగా చేపడుతున్న ఈ పనుల్లో గ్రామానికి చెందిన 398 మంది ఉపాధి కూలీలు పాల్గొంటున్నట్లు ఫీల్డ్ అసిస్టెంటు నారాగనా కృష్ణవేణి తెలిపారు. ఉపాధి పనులు ఉదయం 7 గంటలకు ప్రారంభమై 11 గంటలకే ముగిస్తున్నట్లు తెలిపారు. కూలీలు సేద తీరేందుకు టెంట్ సౌకర్యం ఏర్పాటు చేసి, తాగునీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో పక్షం రోజులు మట్టి తోలకం చేపడతామని, చెరువు మట్టి కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్ ప్రతులు అందజేయాలని తెలిపారు.

వరి కొయ్యలకు నిప్పు.. తప్పిన ప్రమాదం

నడిగూడెం : మండల కేంద్రం నుంచి మునగాల మండలం కలకోవకు వెళ్లే ప్రధాన రహదారి వెంట పొలాల్లో వరి కొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పంటించారు. దీంతో మంటలు నడిగూడెం గ్రామ సమీపానికి వ్యాపించాయి. అంతేకాకుండా పలువురు రైతులకు చెందిన మామిడి చెట్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు సమాచారం ఇవ్వడంతో కోదాడ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అతి కష్టం మీద ఆర్పారు. దీంతో ప్రమాదం తప్పడంతో గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక వాహనాన్ని రాత్రి నడిగూడెంలోనే ఉంచారు.